

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ లక్ష్మీపురంలో శుక్రవారం బీరప్ప ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనంతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్నా నీవే రక్ష

వేములవాడ: రాజన్నను శుక్రవారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు దగ్గర పడుతుండడంతో రోజురోజుకు భక్తుల రద్దీ పెరిగిపోతుంది.

గరిష్టం/కనిష్టం
40.0/29.0

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఓటరు నమోదుకు ఇంటింటా సర్వే



మాట్లాడుతున్న ఆర్డీవో వీరబ్రహ్మచారి

మంథని: ప్రత్యేక ఓటరు నమోదులో భాగంగా బీఎల్‌వోలు ఇంటింటా సర్వే నిర్వహించాలని మంథని ఆర్డీవో వీరబ్రహ్మచారి అన్నారు. శుక్రవారం మంథనిలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని రాజకీయ పార్టీలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2023 అక్టోబర్ 10 వరకు 18ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేందుకు వారి వివరాలు సేకరించాలన్నారు. అలాగే ఓటరు జాబితాలో సవరణలు, నియోజకవర్గంలోని 288 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ నమోదుకు సంబంధించిన సమస్యలున్నా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లను సంప్రదించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఈ అవకాశాన్ని అర్హత కలిగిన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ బండి ప్రకాశ్, ఎలక్షన్ డెప్యూటీ తహసీల్దార్ సంతోష్‌సింగ్ ఠాగూర్, డెప్యూటీ తహసీల్దార్ సిరిపురం గిరి తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ



దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఎలిగేడు(పెద్దపల్లి): ఎలిగేడు మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం ఇన్‌స్పెక్టర్ కృష్ణ, వ్యవసాయ శాఖ అధికారి ఉమాపతి శుక్రవారం తనిఖీ చేశారు. నకిలీ విత్తనాల గురించి వివరిస్తూ సంబంధిత పత్రాలు, స్టాక్ రిజిష్టర్, బిల్‌బుక్కులను పరిశీలించారు. నకిలీ విత్తనాలను విక్రయించొద్దని సూచించారు.

పట్టుదలతో ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చు



క్రీడాకారులను సన్మానిస్తున్న రఘువీర్‌సింగ్

జూలపల్లి(పెద్దపల్లి): క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నేనున్నా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ అన్నారు. సీఎం కప్ రాష్ట్రస్థాయిలో ఆడేందుకు ఎంపికైన జూలపల్లి క్రీడాకారులను శుక్రవారం సన్మానించారు. గ్రామీణ క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్రస్థాయిలో రాణించిన క్రీడాకారులకు మొదటి బహుమతిగా రూ.25వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు లాల్ మహ్మద్, నాయకులు కొమురయ్య, అంకూస్, మేరుగు రమేశ్, షాబొద్దీన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనను వివరించి ప్రజల మద్దతు కూడగట్టాలి




మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

పెద్దపల్లిరూరల్: ప్రధాని నరేంద్ర మోదీ పాలన తీరును, ప్రజా సంక్షేమానికి అమలు చేసిన పథకాలను వివరిస్తూ ప్రజల మద్దతును కూడగట్టాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ప్రతి బూత్‌స్థాయిలో మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం అట్టడుగున ఉన్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తుందని అన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మల్లిఖార్జున్, చందుపట్ల సునీల్‌రెడ్డి, పోచం, గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి, దాడి సంతోష్, శివాజీ, రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు జూలపల్లి మండలానికి చెందిన ఠాకూర్ జీవన్‌సింగ్. పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం పోయగా వారం కింద కాంటా వేశారు. లారీలు రాకపోవడంతో బస్తాలు నింపి ఆగిపోయాయి. మిల్లుకు పోయేవరకు రైతుదే బాధ్యత అనడంతో ధాన్యం కాపాడుకునేందుకు రాత్రింబవళ్లు పడిగాపులు కాసేందుకు అవసోపాలు పడుతున్నాడు. జిల్లాలో చాలామంది రైతులు ఇలాంటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.



ధర్మారం కొనుగోలు కేంద్రంలో లారీలు రాక తూకం వేసి ఉన్న ధాన్యం వస్తాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న ట్రక్‌షీట్స్ అంతర్గాం మండలం మద్దిర్యాల గ్రామానికి చెందిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకున్న రైతులవి. శ్రీను (377బస్తాలు), రాజయ్య (217బస్తాలు), తిరుపతి(72బస్తాలు) అనే రైతులకు సంబంధించిన ధాన్యాన్ని బస్తాకు 42కిలోల చొప్పున మళ్లీ ఎలాంటి తరుగు తీయమంటూ కాంటా పెట్టి మొత్తం 666 బస్తాలను లారీలో లోడ్‌వేసి మిల్లుకు తరలించారు. తీరా మిల్లుకు వెళ్లాక నాణ్యత పేరుతో 20 బస్తాలు కటింగ్ చేసి 646 బస్తాలకే రశీదు ఇచ్చారు. ఇదేం అన్యాయం అంటూ సదరు రైతులు ప్రభుత్వం ప్రకటించిన హెల్ప్‌లైన్ నెంబర్ 1800425003333కి కాల్ చేస్తే మరో అధికారి నంబర్ ఇచ్చారు. ఆ నంబర్‌కు ఫోన్‌చేస్తే లిఫ్ట్ చేయటం లేదని, ప్రభుత్వం మాటలతో సరిపెట్టకుండా, చేతల్లో న్యాయం చేయాలంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లారీలు రాక.. ధాన్యం తరలక..

కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల అవస్థలు

- కేంద్రాలు, మిల్లుల్లో తరుగు పేరిట దోపిడీ
- ‘కోత’కు ఒప్పుకుంటేనే లోడింగ్, అన్‌లోడింగ్
- నిలువునా నష్టపోతున్న అన్నదాతలు
- అధికారులు, నేతలు చెప్పినా మారని వైనం

సాక్షి, పెద్దపల్లి: మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు చెప్పిన మాటలు ఉత్తముచ్చట్లే అని తెలిపోతోంది. యంత్రాంగం ఎంత చెప్పినా ఇటు కేంద్రాల్లో, అటు మిల్లుల్లో దోపిడీ మాత్రం ఆగటం లేదు. అన్నదాతలు, విపక్షాలు రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేసినా దోపిడీ కొనసాగుతూనే ఉంది. తాలు పేరుతో కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు, లారీ లోడ్ మిల్లర్లకు చేరినంక వడ్లు నాణ్యత లేవంటూ బస్తాలకు కోత పెడుతున్నారు. లారీల కొరతతోపాటు, ధాన్యంతో మిల్లులకు వెళ్తున్న లారీలు రెండు మూడు రోజుల పాటు అక్కడే ఉంటున్నాయి. దీంతో కాంటా పూర్తయినా కేంద్రాల్లోనే ఉంటున్నాయి. లారీలు సమయానికి రాకపోవడంతో అన్నదాతలు కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నారు. ఉన్నట్లుండి వర్షం పడితే ధాన్యం నీటిపాలవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తరుగు తీస్తున్నారు ఇలా..

కొనుగోలు కేంద్రాల్లో ఒక్కో బస్తాలో 40 కిలోల వడ్లను నింపుతారు. అయితే గోనె సంచి బరువు 600గ్రాములు, తాలు పేరుతో 400 గ్రాములు కలిపి కిలో వరకు సాధారణంగా తరుగు తీస్తుంటారు. దానికి రైతులు అభ్యంతరం చెప్పరు. కానీ ఈసారి 41కిలోలకు బదులుగా 43 కిలోలు తూకం వేస్తున్నారు. మిల్లులకు చేరిన ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేసేందుకు బస్తాకు మరో రెండు నుంచి మూడు కిలోల తరుగుకు ఒప్పుకుంటేనే దింపుకుంటామని మిల్లర్లు చెప్పుతుండటం, లేకుంటే వాపస్ పంపిస్తామని బెదిరిస్తుండటంతో తప్పని పరిస్థితుల్లో ఒప్పుకుంటున్నారు. దీంతో రెండు చోట్లా కలిపి రైతులు క్వింటాల్ వడ్లకు 5నుంచి 7 కిలోల వరకు నష్టపోతున్నారు. ఈ విషయమై డీఎస్‌వో వివరణ కోరగా తరుగు పేరుతో మిల్లర్లు కటింగ్ పెడితే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తూకం వేసి మూడు రోజులైంది



ధర్మారంలోని కొనుగోలు కేంద్రానికి 30రోజుల క్రితం ధాన్యం తీసుకురాగా లేనిపోని కారణాలు చూపుతూ తూకం వేయలేదు. తూకం వేసి మూడు రోజులు గడుస్తున్నాయి. లారీలు రాకపోవడంతో బస్తాల వద్దనే పగలు, రాత్రి ఉంటున్నాం. బస్తాలను తరలించక పోవడంతో ఇబ్బంది పడుతున్న. – ఈరు ఎల్లమ్మ, ధర్మారం

14 రోజుల నుంచి ఇక్కడే..



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి నెలరోజులైంది. 14 రోజుల క్రితం కాంటా పెట్టి సొసైటీ వారు బస్తాలు నింపారు. లారీలు లేకపోవటంతో సెంటర్‌లోనే బస్తాలు ఉన్నాయి. లోడ్ చేసి పంపినాక మిల్లర్లు మళ్లీ కోతలు పెడుతున్నారు. రైతులు ఒప్పుకుంటేనే అన్‌లోడింగ్ చేస్తున్నారు. అధికారులు, నేతలు మాటలు అంతా ఉత్తముచ్చట్లే. – రామినేని సతీశ్, ఓదెల

పాలిసెట్‌లో 79శాతం ఉత్తీర్ణత



డి.విశ్వాస్

పెద్దపల్లిరూరల్: రాష్ట్రప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన పాలిసెట్ ఫలితాల్లో జిల్లాలో 79శాతం ఉత్తీర్ణులయ్యారు. మే 17న నిర్వహించిన పరీక్షకు 1,605 మంది బాలికలు, 1,189 మంది బాలురు మొత్తం 2,794 విద్యార్థులు హాజరయ్యారు. ఎంపీసీ విభాగంలో 2,195 మంది విద్యార్థులు 78.56తో ఉత్తీర్ణులయ్యారు. ఎంబైపీసీ విభాగంలో 2227మంది విద్యార్థులు 79.71శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఇందులో కాట్నపల్లికి చెందిన కేశిరెడ్డి రిషితరెడ్డికి 74వ ర్యాంకు, రంగంపల్లికి చెందిన బొద్దుల నిశాంత్‌కి 144వ ర్యాంకు, రామగుండం అయోధ్యనగర్‌కు చెందిన మబ్బు వినయ్‌కి 333ర్యాంకులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. రెండు విభాగాల్లోనూ ఉత్తీర్ణులైన వారిలో బాలుర కంటే బాలికలే ఎక్కువ మంది ఉన్నారు.

‘ఖని’ విద్యార్థికి 336వ ర్యాంక్

గోదావరిఖనిటౌన్: సప్తగిరికాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి డి.విశ్వాస్ 336వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీకాంత్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

‘11వ వేతన ఒప్పందం వర్తింపజేయాలి’

గోదావరిఖని: 11వ వేతన ఒప్పందాన్ని కాంట్రాక్టు కార్మికులకు కూడా వర్తింపజేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు తోకల రమేశ్ అన్నారు. శుక్రవారం గోదావరిఖనిలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2013లో జరిగిన హైపవర్ కమిటీ వేతన ఒప్పందాన్ని ఇంతవరకు ఎందుకు అమలు చేయలేదో వేజ్‌బోర్డు సంఘాలు సమాధానం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కొయ్యడ శంకర్, మాట్ల సమ్మయ్య, ఎర్రల సారయ్య, పులిపాక రాజేందర్, కొయ్యడ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కాలనీపై చిన్నచూపు

- శుభ, అశుభ కార్యాలు జరిగితే బ్రాహ్మణులు రాని దుస్థితి
- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: పట్టణంలోని అంబేడ్కర్‌కాలనీపై చిన్నచూపు చూస్తున్నారని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. శుక్రవారం అంబేడ్కర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏదైన శుభ, అశుభ కార్యం జరిగితే బ్రాహ్మణులు రాని దుస్థితి ఉందని తెలిపారు. 40ఏళ్ల పాలనలో దుద్దిళ్ల కుటుంబం చేస్తున్న అన్యాయాలు, అక్రమాలపై నియోజక వర్గ ప్రజల్లో అవగాహన కల్పిస్తుంటే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు తనను దూషించే పనిని ఎత్తుకున్నారన్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అంబేడ్కర్‌నగర్‌లో అంటరానితనాన్ని ఎందుకు రూపుమాపడం లేదో ప్రశ్నించాలని తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో టీటీడీ చైర్మన్‌గా ఉన్న కరుణాకర్‌రెడ్డి 2007లోనే తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామిని దళిత గోవిందం పేరుతో దళితవాడల్లోకి తీసుకెళ్లాడని అన్నారు. ఎస్సీ సామాజిక వర్గంపై ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే అంబేడ్కర్‌నగర్‌లోని ఇళ్లకు పురోహితులను పంపించాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేడ్కర్‌నగర్ సమీపంలోని బన్నె చెరువు నుంచి ఒర్రెకుంటకు నీళ్లు నింపేందుకు పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, కోఆప్షన్ సభ్యుడు యాకూబ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, నాయకులు శంకర్‌లాల్, వేల్పుల గట్టయ్య, వీకే.రవి, కొట్టె రమేశ్, పాపారావు, సీపతి బానయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ వరమా భారమా?

- ఇంటి జాగా ఉన్న బీదలకు రూ. 3లక్షలు వరమే
- పీఎంఏవై రూ.2 లక్షల తోడైతే పూర్తిస్థాయి రేకుల ఇల్లు
- నిర్మాణరంగంపై పెరిగిన బొగ్గు ధరల ప్రభావం
- చదరపు అడుగుకు రూ.1500 నుంచి రూ.2000కు పెంపు
- ఉమ్మడి జిల్లాలో 36 వేల మందికి రూ.10 కోట్లు అవసరం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన గృహలక్ష్మి పథకం సొంతింటి జాగా కలిగిన ఇల్లులేని పేదలకు వరమేనని బిల్డర్లు అంటున్నారు. రోజురోజుకు నిర్మాణ వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న నేపథ్యంలో ఇల్లు కట్టుకునేందుకు జంకుతున్న నిరుపేదలకు ఈ పథకం అనుకూలమని నిర్మాణరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముందస్తు పథకం ప్రకారం.. ఖర్చు నిర్దేశించుకుని నిర్మాణం చేపడితే.. సకాలంలో పూర్తవడమే కాకుండా.. తక్కువ బడ్జెట్‌లో ఇల్లు చేతికి వస్తుందని అంటున్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న గృహలక్ష్మి పథకానికి, ప్రధానమంత్రి ఆవాస్ యోజన్ (పీఎంఏవై) పథకం తోడైతే.. ఇంటి నిర్మాణం మరింత సులువు అవుతుందని వివరిస్తున్నారు.

భారీగా పెరిగిన వ్యయం

కరోనా తరువాత నిర్మాణ రంగంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలోని ప్రతీ నిర్మాణ రంగానికి మూలమైన ఇటుకల ధర భారీగా పెరిగింది. ప్రతీ జిల్లాలోని ఇటుకల తయారీకి ప్రధాన వనరు అయిన ఎన్టీపీసీ ఫ్లైయాష్‌ను టెండర్లకు ఇవ్వడం ఇందుకు ప్రధాన కారణం. తద్వారా ఒకప్పుడు అక్కడ 30 టన్నుల బూడిదలారీని రూ.700కి ఇచ్చేవారు. ప్రస్తుతం అది రూ.12,000లకు చేరింది. ఫలితంగా ఇటుక ధరలు పెరిగాయి. ఫలితంగా రాష్ట్రంలో ప్రతీ ఇంటి నిర్మాణంపైనా దాదాపు రూ.30వేల అదనపు భారం పడుతోంది. ఇటీవల బొగ్గు ధర కూడా ఆకాశాన్ని అంటుతోంది. దీంతో ఇటుకల పరిశ్రమలో ఉత్పత్తి చేసిన ఇటుకలను కాల్చేందుకు ఊక (ఉనుక)తోపాటు బొగ్గును వాడుతారు. దాని ప్రభావం ఇటుకల ధరలపై పడుతోంది. బొగ్గు ధరల ప్రభావం స్టీలుపైనా ఉందంటున్నారు. ఫలితంగా 2021 వరకు రూ.7లుగా ఉండే మట్టి ఇటుక ధర ప్రస్తుతం రూ.9 నుంచి రూ.10వేలకు చేరుకోవడం వెనక కారణం ఇదే.

గృహలక్ష్మికి పీఎంఏవై జత కలిస్తే

ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం.. చదరపు అడుగుకు రూ.2000 వరకు బిల్డర్లు వసూలు చేస్తున్నారు. కరోనాకు ముందు ఇది రూ.1500గా ఉండేది. ఒక మధ్య తరగతి కుటుంబం పిల్లర్లు వేసి 800 చదరపు అడుగుల డబుల్ బెడ్ ఇంటిని నిర్మించుకుంటే.. దాదాపుగా రూ.16 లక్షల వరకు ఖర్చవుతోంది. ఇదే గృహలక్ష్మి పథకంలో నిర్మాణం చేపడితే.. రూ.3 లక్షలు ఏ మూలకు సరిపోవు. ఇక్కడే నిర్మాణరంగ నిపుణులు మరో ఆలోచన ముందుంచుతున్నారు. నివాసగృహం లేని వారంతా ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై) కింద దరఖాస్తు చేసుకుంటే మరో రూ.2లక్షలు కూడా వస్తాయని గుర్తుచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.3లక్షలకు కేంద్రం నుంచి వచ్చే రూ.2 లక్షలు జతకలిస్తే ప్రతీ లబ్ధిదారునికి కొండంత అండగా ఉంటుందని సలహా ఇస్తున్నారు. ఇంకా చెప్పాలంటే.. పేదింటిని 800 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.3లక్షలతో డబుల్ బెడ్‌రూం, హాల్, కిచెన్‌తో కూడిన రేకులషెడ్ నిర్మాణం చేయవచ్చు. మిగిలిన రూ.2లక్షలతో తలుపులు, కిటికీలు, లోపల షెల్ఫులు, సీలింగ్ కూడా చేసుకోవచ్చని సూచిస్తున్నారు. అదే మధ్య తరగతి కుటుంబాలు ఈ రూ.5 లక్షలకు మరికొన్ని డబ్బులు కలుపుకుని, లేదా బ్యాంకు రుణాలు తీసుకుని సొంతింటి కలను నెలవేర్చుకోవచ్చని వివరిస్తున్నారు.

36 వేల మందికి రూ.10 కోట్లు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలుగా వర్గీకరించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నాలుగు కొత్త జిల్లాల పరిధిలో మాత్రం 12ఉన్నాయి. ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా ప్రతీ నియోజకవర్గానికి 3000 మంది లబ్ధిదారుల చొప్పున మొత్తం 36,000 మందిని ఎంపిక చేస్తారు. వీరికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయడానికి ప్రభుత్వం మొత్తం రూ.10.08 కోట్లు నిధులు కావాల్సి ఉంటుంది.

‘ముస్కాన్’లో మెరిసిన ‘ఖని’ ఆస్పత్రి



గోదావరిఖనిలోని జీజీహెచ్ ఆస్పత్రి

- ఫలితాలను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

కోల్‌సిటీ(రామగుండం): నవజాత శిశుమరణాల రేటును తగ్గించడంతో పాటు ప్రభుత్వాస్పత్రుల్లో ఉచిత వైద్య సేవలను మరింత ఎక్కువగా మెరుగుపర్చేందుకు కేంద్రం పెట్టిన ‘ముస్కాన్(స్మైల్)’ స్కీం పోటీల్లో రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ఉత్తమ స్కోర్ చేసింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 3, 4వ తేదీల్లో ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం జీజీహెచ్ ఆస్పత్రిని తనిఖీ చేసి వైద్య సేవల తీరుపై అసెస్‌మెంట్ చేసింది. ఆస్పత్రి తనిఖీలో నమోదు చేసిన స్కోర్ వివరాలను బృందం నివేదికలను రూపంలో కేంద్రానికి పంపించారు. శుక్రవారం నేషనల్ హెల్త్ మిషన్ ఫలితాలను ప్రకటించింది. తెలంగాణ రాష్ట్రంలో ముస్కాన్ స్కీంకు ఏడు ప్రభుత్వాస్పత్రులు ఎంపికైనట్లు అభినందిస్తూ ఎన్‌హెచ్‌ఎం జాయింట్ సెక్రెటరీ విశాల్ చౌహన్ ప్రకటించారు. ముస్కాన్‌కు ఎంపికైన ఆస్పత్రుల్లో రామగుండం జీజీహెచ్ ఆస్పత్రి కూడా ఉండడం గమనార్హం.

రెండు రోజులు తనిఖీ చేసిన బృందం

పుట్టిన నవజాత శిశువు నుంచి 12 ఏళ్లలోపు పిల్లలకు మెరుగైన వైద్య సేవలదించడమే ముస్కాన్ స్కీం ముఖ్య ఉద్దేశ్యం. పిల్లల సేవలందించే అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను నేషనల్ హెల్త్ మిషన్ బృందం ఇటీవల తనిఖీ చేసింది. రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)ని కూడా ఈనెల 3, 4న ఢిల్లీ నుంచి వచ్చిన డాక్టర్ ముస్తాఫా యూనస్, డాక్టర్ వందనసైనీలు పరిశీలించారు. సిబ్బంది పనితీరుతో పాటు రికార్డులు, ఎస్ఎన్‌సీయూ(నవజాత శిశు సంరణ కేంద్రం), పిల్లల వార్డు, పిల్లల ఔట్ పేషెంట్లు, వైద్య పరికరాలు, ఇంజక్షన్ గదులను తనిఖీ చేశారు. సేవల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి చెక్ లిస్టు ఆధారంగా అసెస్‌మెంట్ చేసి, వివరాలు నమోదు చేసుకున్నారు.

రూ.3లక్షల నగదు బహుమతి

ముస్కాన్‌కు ఎంపికైన గోదావరిఖని, ఖమ్మం, సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రులకు షరతులతో కూడిన నాణ్యత ధ్రువీకరణ మంజూరు చేశారు. దీంతో ఒక్క ఏడాదికి మాత్రమే రూ.3లక్షల నగదు బహుమతికి ఎంపికైంది. ఈ నిధుల నుంచి 25 శాతం సిబ్బందికి ఇన్సెంటివ్‌గా కేటాయించగా, మిగిలిన 75 శాతం నిధులను పిల్లల వైద్య సేవల అభివృద్ధికి వినియోగించాల్సి ఉంటుంది.

మెరుగైన సేవలపై దృష్టిపెట్టాలి

ముస్కాన్ స్కీంకు షరతులతో కూడిన నాణ్యత ధ్రువీకరణకు ఎంపికైన గోదావరిఖని జీజీహెచ్ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందించడంపై అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. తనిఖీ కోసం ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక పరిశీలన బృందాన్ని ఆకట్టుకునేలా ఆస్పత్రిని అందంగా ముస్తాబు చేసిన అధికారులు, పరిశీలన ముగిసిన తర్వాత చేతులెత్తేశారు. పిల్లలు ఆహ్లాదంగా గడపటానికి ఓపీ, వార్డుల దగ్గర ప్రత్యేక ఆట బొమ్మలను ఏర్పాటు చేసిన అధికారులు, బృందం పరిశీలన ముగిసాక వాటిని తొలగించి ఆ ఆనవాళ్లు లేకుండా చేశారు. ఇలాంటి మెప్పుకోసం చేస్తున్న మొక్కుబడి చర్యలపై ఆస్పత్రికి వచ్చే ప్రజల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ముస్కాన్‌లో గోదావరిఖని జీజీహెచ్ సాధించిన స్కోర్ వివరాలు

డిపార్ట్‌మెంట్	మొత్తం స్కోర్	సాధించిన స్కోర్
పీడియాట్రిక్ ఓపీడీ	100 శాతం	79 శాతం
పీడియాట్రిక్ వార్డు	100 శాతం	90 శాతం
ఎస్ఎన్‌సీయూ	100 శాతం	80 శాతం

ఎదురుచూపులు ఇంకెన్నాళ్లో?

- కొలిక్కి రాని ఎన్టీపీసీ కార్మికుల వేతన ఒప్పందం
- కొనసాగుతున్న చర్చలు.. కార్మికుల్లో నైరాశ్యం
- 22 సార్లు చర్చించినా ముందుకు పడని అడుగు


సత్యాగ్రహ దీక్షలో కూర్చున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్(ఫైల్)

జ్యోతినగర్: దక్షిణాదికి వెలుగులు పంచుతున్న ఎన్టీపీసీ రామగుండం కార్మికుల బతుకుల్లో మాత్రం చీకట్లు నింపుతోంది. కార్మికుల వేతన ఒప్పందం 2022 ఆగస్టు 10తో కాలపరిమితి ముగిసింది. అందులోని కొన్ని కీలక డిమాండ్లను సైతం యాజమాన్యం నేటికి అంగీకరించ లేదనే ఆరోపణలున్నాయి. ఎన్టీపీసీ రామగుండంలో 2,800 మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. అన్‌స్కిల్డ్, సెమీస్కిల్డ్, స్కిల్డ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. అధికంగా కార్మికులు అన్‌స్కిల్డ్‌గానే ఉన్నారు. వేతన ఒప్పందానికి కార్మిక సంఘాల ప్రతినిధులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తున్నారు. నేటికి ఐదుసార్లు రీజినల్ లేబర్ కమిషనర్(సెంట్రల్) వద్ద, 17సార్లు ఎన్టీపీసీ యాజమాన్యంతో చర్చించినప్పటికీ ఎలాంటి ఒప్పందం కుదురలేదు. దీంతో కార్మికుల్లో నైరాశ్యం నెలకొంది. 2018 వేతన ఒప్పందంలోని పలు డిమాండ్లు అమలు చేయకపోవడంతో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రాజెక్టు రోడ్డులో గతేడాది ఫిబ్రవరిలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో కార్మిక సంఘాల ప్రతినిధులు ఈనెల 15న సమ్మెకు వెళ్తున్నట్లు నోటీసులను యాజమాన్యానికి అందించారు. దీంతో ఈనెల 24న హైదరాబాద్‌లోని కేంద్ర కార్మిక శాఖ అధికారి సమక్షంలో చర్చలు జరిగాయి. చర్చల్లో ప్రస్తుతమున్న అదనపు భత్యం కంటే రూ.2,900 పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేయగా యాజమాన్యం కేవలం రూ.400 ఇస్తామని తెలియజేశారు. ఈక్రమంలో చర్చలు ఎట్టకేలకు వాయిదా పడిన విషయం తెలిసిందే. దీంతో కార్మిక సంఘాలు కార్మికులకు వేతన పెంపుదల విషయంలో పట్టువదలకుండా ఉన్నప్పటికీ, యాజమాన్యం ససేమిరా అనేలా ప్రవర్తిస్తుండడంతో జూన్ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించే చర్చలకు ముందు ప్రాజెక్టు పరిధిలో స్థానికంగా కార్మిక సంఘాల ప్రతినిధులు, యాజమాన్యం ప్రతినిధులు చర్చించుకునే అవకాశం ఉంది. కానీ చర్చలు కార్మికులకు ఎంతవరకు ప్రయోజనకరంగా ఉంటాయో వేచి చూడాల్సిందే. కేంద్ర ప్రభుత్వ రంగసంస్థలో పనిచేస్తున్నప్పటికీ తమ బతుకులు అధ్వానంగా మారాయని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచేలా కార్మిక సంఘాలు, యాజమాన్యం కొత్తవేతన ఒప్పందం తీసుకురావాలని కాంట్రాక్టు కార్మికులు కోరుతున్నారు.

కాంట్రాక్టు కార్మికుల వివరాలు

→ రామగుండం ఎన్టీపీసీలో 2,600 మంది కాంట్రాక్టు కార్మికులు అన్‌స్కిల్డ్ కార్మికులు 2000, సెమీ స్కిల్డ్ 500, స్కిల్డ్ కార్మికులు 200, 1000 మంది అసంఘటిత కార్మికులు, 500 మంది రోజువారి కూలీలు.

→ కొత్త ప్రాజెక్టు నిర్మాణంలో 1000 మంది కార్మికులు, కార్యాలయాల్లో 40 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

→ కాంట్రాక్టు కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలు.. అన్‌స్కిల్డ్‌కు రూ.494, సెమీ స్కిల్డ్‌కు రూ.577, స్కిల్డ్‌కు రూ.695 పొందుతున్నారు.

→ ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో కార్మికులు విధులు నిర్వహించే విభాగాలు

ఆపరేషన్ విభాగం, హౌజ్ కీపింగ్, ఎలక్ట్రికల్ మెయింటనెన్స్, సీహెచ్‌పీ మెయింటనెన్స్, మిల్ మెయింటనెన్స్, బాటమ్ యాష్, ఫ్లెయాష్, స్విచ్‌యార్డు, ఎంజీఆర్, డీఎం ప్లాంట్, డోజర్ సెక్షన్, ట్రాక్ హోపర్, హార్టికల్చర్, పంప్‌హౌజ్, వ్యాగన్ టిప్లర్, ఈటీపీ ఆఫ్‌సైడ్, సివిల్, సివిల్ మెయింటనెన్స్‌తో పాటు పలు విభాగాల్లో కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

→ 2018 ఒప్పందంలో 17.44 శాతం అలవెన్సులు తీసుకుంటున్న కార్మికులకు రూ.3,446 పెరిగింది. 15 ఏళ్లు పైబడి విధులు నిర్వహిస్తున్న వారికి పదోన్నతి కల్పించడం, రాత్రి విధుల అలవెన్సులు రూ.160తో పాటు 16 డిమాండ్లపై అంగీకారం కుదిరింది.

→ 2022 ఒప్పందం కాలపరిమితి ఆగస్టు 15తో ముగియడంతో ప్రధాన డిమాండ్లతో ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ (జేఏసీ)గా 2022 ఆగస్టు 10వ తేదీన యాజమాన్యంకు 12 ప్రధాన డిమాండ్లతో డిమాండ్ నోటీసులు అందించారు.

కాంట్రాక్టు కార్మికుల ప్రధాన డిమాండ్లు...

→ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి.

→ ప్రస్తుతం పొందుతున్న అలవెన్సులపై రూ.10,500 అదనంగా చెల్లించాలి.

→ కనీస బోనస్‌పై 30శాతం పెంచాలి.

→ ఖాళీగా ఉన్న క్వార్టర్లలో కార్మికులకు అవకాశం కల్పించాలి. లేనియెడల హెచ్‌ఆర్‌ఏ బేసిక్‌పై 60శాతం చెల్లించాలి.

→ నైట్ అలవెన్సులు 500 చెల్లించాలి. డస్ట్ అలవెన్సు ప్రతీనెల రూ.1,000 చెల్లించాలి.

→ కార్మికులకు స్టాటుటరి, నాన్ స్టాటుటరి అలవెన్సులు అందరికీ పూర్తిగా చెల్లించాలి.

→ రెయిన్ కోట్, వార్మ్‌కోట్, రెండు జతల బట్టలు, షూలు ఇవ్వాలి.

→ ప్రమాద మరణం సంభవిస్తే కార్మికుడి కుటుంబానిక రూ. 20 లక్షలు ఇవ్వాలి.

→ ఆన్ డ్యూటీలో సాధారణ మరణం పొందితే రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

→ ఉద్యోగ విరమణ పొందినా, మరణించిన కార్మికుడు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం లేదా రూ.10 లక్షలు చెల్లించాలి.

→ డిపెండెంట్ కింద పనిలో చేరిన కార్మికులకు పూర్తిస్థాయి అలవెన్సులు, పర్మినెంట్ గేట్ పాసులు ఇవ్వాలి.

→ డెత్‌రిలీఫ్ ఫండ్‌ను పూర్తిస్థాయిలో ఎన్టీపీసీ యాజమాన్యం బాధ్యతగా తీసుకుని కొనసాగించాలి.

వేతన ఒప్పందాన్ని అమలు చేయండి



వేతన ఒప్పందం కాలపరిమితి ముగిసినప్పటికీ యాజమాన్యం చర్చల పేరుతో కాలయాపన చేస్తోంది. తొమ్మిది నెలలు గడుస్తున్నా కొత్త వేతన ఒప్పందం అమలు చేయకపోవడం బాధాకరం. కొత్త వేతన ఒప్పందం కోసం కార్మికులు ఎదురు చూస్తున్నారు. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో కార్మికుల పిల్లలకు అవకాశాలు కల్పించాలి.

– చిలుక శంకర్, ఐఎఫ్‌టీయూ నాయకుడు

ఎమ్మెల్యే సహకారంతో ఉద్యమం



ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందం అమలు జాప్యంపై గతేడాది ఫిబ్రవరిలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రాజెక్టు రోడ్డులో సత్యాగ్రహ దీక్ష చేశారు. కొత్తవేతన ఒప్పందం చర్చలు 22సార్లు జరిగినా కొలిక్కి రాకపోవడంలో ఆంతర్యం ఏంటో తెలియడం లేదు. ఎమ్మెల్యే సహకారంతో మళ్లీ ఉద్యమం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

– ఇజ్జగిరి భూమయ్య, బీఆర్‌ఎస్ కార్మిక సంఘం నాయకుడు

క్లుప్తంగా

అవయవ దానానికి అంగీకారం


ఒప్పందపత్రాలను సదాశయ ఫౌండేషన్ సభ్యులకు అందజేస్తున్న మల్లేశ్

పాలకుర్తి: బసంత్‌నగర్‌లో చిరువ్యాపారం చేసే సింగరేణి మాజీ ఉద్యోగి కొక్కుల మల్లేశ్ తన మరణానంతరం శరీరాన్ని దానం చేసేందుకు ముందుకు వచ్చి ఆదర్శంగా నిలిచారు. ఈ మేరకు శుక్రవారం సదాశయ ఫౌండేషన్ పాలకుర్తి మండల కన్వీనర్ భీమనపల్లి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో సంబంధిత పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మల్లేశ్‌కు ఫౌండేషన్ సభ్యులు ఐడికార్డు, ప్రశంసా పత్రం అందించారు. మరణానంతరం తన శరీరం మట్టిలో కలిసిపోకుండా ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో రామగుండం మెడికల్ కళాశాలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మీన మహేందర్, భూమేశ్, చింతకింది కనుకయ్య, ఆడెపు ప్రేంసాయి తదితరులు పాల్గొన్నారు.

రైల్లోంచి జారిపడి విద్యార్థి మృతి


రోహిత్(ఫైల్)

పెద్దపల్లిరూరల్: రైల్వే స్టేషన్ సమీపంలోని కూనారం రైల్వేక్రాసింగ్ వద్ద శుక్రవారం భాగ్యనగర్‌లో ప్రయాణిస్తున్న విద్యార్థి ప్రమాదవశాత్తు జారీ అదే రైలు కింద పడి మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా తాండూరు మండలం తంగళ్లపల్లికి చెందిన రోహిత్(22) ఇంటర్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం రేచినీరోడ్ రైల్వేస్టేషన్‌లో భాగ్యనగర్ ఎక్కి ప్రయాణిస్తూ పెద్దపల్లి స్టేషన్ దాటిన కొద్దిదూరంలోనే ప్రమాదవశాత్తు జారి రైలుకిందపడి మృతిచెందాడు. మృతుడి తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు రైల్వేపోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామగుండం: ఈనెల 22న పెద్దపల్లి నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న దూస మల్లేశం అనే వ్యక్తి మల్యాలపల్లి శివారులో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తలతోపాటు కంటిపై బలమైన గాయాలవడంతో మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌కు తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడు మంచిర్యాల జిల్లాకేంద్రంలోని సున్నంబట్టివాడకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రామగుండం ఎస్సై బత్తుల శరణ్య తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లికి చెందిన రంగు రాజేశంగౌడ్ గీత కార్మికుడు గురువారం రాత్రి తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గాయాలపాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. చికిత్స నిమిత్తం బాధిడిని 108లో కరీంనగర్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దాడి కేసు నమోదు

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలకుర్తి మండలం ఎఫ్‌సీఐ ఎల్కలపల్లి గేట్ గ్రామానికి చెందిన దబ్బెట భానుచందర్‌పై కుటుంబ కలహాల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన దమ్మాల రాకేశ్, దమ్మాల వెంకటేశ్, దమ్మాల నర్సమ్మ, రవళి దాడిచేశారని పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎన్టీపీసీ ఎస్సై జీవన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రచ్చపల్లిలో అభివృద్ధి పనుల ప్రారంభం


అధికారులతో మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: మండలంలోని రచ్చపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులను జెడ్పీ చైర్మన్ పుట్టమధు ప్రారంభించారు. ఎల్ఐసీ సంస్థలో బీమా గ్రామంగా ఎంపికైన రచ్చపల్లికి రూ. 75 వేలు మంజూరు కాగా సెంట్రల్ లైటింగ్, పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఎల్ఐసీ సీనియర్ డివిజన్ మేనేజర్ ఎస్‌వీ.ప్రసాద్, పెద్దపల్లి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ పురుశోత్తం, మంథని సీఐ సతీశ్, ఎస్సై వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, సర్పంచ్ కనవేన శ్రీనివాస్, ఎంపీటీసీ మిరియాల ప్రసాద్‌రావు, ఉప సర్పంచ్ గుర్రం సదానందం, తదితరులు ఉన్నారు.

ధాన్యం తరలింపులో ఇబ్బంది పెట్టొద్దు

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి బస్తాల తరలింపులో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని పుట్టమధు సూచించారు. శుక్రవారం మంథని మార్కెట్ యార్డును సందర్శించారు. రైస్‌మిల్లర్లు సంపూర్ణ సహకారం అందించాలని, మిల్లుల్లో ధాన్యం నిల్వలు ఎక్కువైతే మంథని, వెంకటాపూర్ గోదాంలో నిల్వచేయాలని సూచించారు. ధాన్యం తరలింపులో ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

యంత్రాల నిర్వహణలో నైపుణ్యం కనబర్చాలి

- ఆర్జీ–3 జీఎం టీవీరావు


యంత్రాన్ని ప్రారంభిస్తున్న జీఎం టీవీరావు

గోదావరిఖని: భారీయంత్రాల నిర్వహణలో నైపుణ్యం కనబర్చి వాటి జీవిత కాలం పెంచాలని ఆర్జీ–3 జీఎం టీవీరావు పేర్కొన్నారు. శుక్రవారం ఓసీపీ–1 బేస్‌వర్క్‌షాప్‌లో రూ. 1.43 కోట్లతో కొనుగోలు చేసిన టైర్‌హ్యాండ్లర్ యంత్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ యంత్రంతో ఉద్యోగులు సులువుగా భారీ వాహనాల టైర్లను మార్చవచ్చన్నారు. దీంతో సమయం, శ్రమ తగ్గుతుందన్నారు. ఎంతో ఖర్చుపెట్టి కొనుగోలు చేస్తున్న భారీ యంత్రాల టైర్లను కాపాడుతూ.. వాటి జీవితకాలం పెంచాలని కోరారు. ప్రతీ ఉద్యోగి రక్షణ పట్ల అప్రమతంగా ఉండి ప్రమాదాలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, ప్రాజెక్ట్ అధికారి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారులు వెంకటరమణ, శ్రీనివాస్, ఉదయ్‌హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయింపు


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న చందనాపూర్ వాసులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం చందనాపూర్ గ్రామంలోని భూ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించకుండానే సింగరేణి యాజమాన్యం ఇళ్లను ఖాళీ చేయాలంటూ విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో శుక్రవారం చందనాపూర్ వాసులు ప్రధాన రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సింగరేణి ప్రభావిత గ్రామాల మాదిరిగా చందనాపూర్ ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. దీంతో గోదావరిఖని టూటౌన్ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని నచ్చజెప్పి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో నిరసనను విరమించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి శంకరయ్య, జల్లారం సర్పంచ్ హరీశ్, శ్రీనివాస్ మల్లేపల్లి రవి, ఉపసర్పంచ్ సాగర్, కో–ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ఎలువాక ఓదెలు, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

జ్యోతినగర్: బాలికా సాధికారత మిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో శుక్రవారం ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లోని కాకతీయ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు మేజిక్ రాజా, హరి, జీవన్ ప్రదర్శనలు ప్రదర్శనలతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్, సీఎస్సార్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య


రింజుదేవి(ఫైల్)

పాలకుర్తి: మండలంలోని జయ్యారం గ్రామంలో రింజుదేవి (32) వివాహిత శుక్రవారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువులు, బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దినేష్‌గుప్తా ఆరేళ్ల క్రితం జయ్యారం గ్రామానికి ఉపాధికోసం వచ్చాడు. ధర్మారం క్రాస్‌రోడ్డులోని బోడగుట్ట స్టోన్‌క్రషర్‌లో క్రషర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. దినేష్‌గుప్తా భార్య రింజుదేవి మానసిక స్థితి మూడేళ్లుగా బాగుండడం లేదు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ ఎలాంటి మార్పులేదు. ఈక్రమంలో శుక్రవారం తెల్లవారుజామున దినేష్‌గుప్తా స్నానం చేస్తుండగా ఇంటి నుంచి బయటకు వచ్చిన రింజుదేవి గ్రామశివారులోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. తన భార్య ఇంట్లో కనిపించకపోవడంతో దినేష్ గుప్తా గ్రామంలో వెతకగా స్థానికులు అందించిన సమాచారంతో ఎల్లమ్మ ఆలయం వైపు వెళ్లాడు. అనుమానంతో బావిలోకి చూడగా శవం తేలియాడుతూ కనిపించింది. వెంటనే స్థానికులకు సమాచారం అందించడంతో వారు బసంత్‌నగర్ పోలీసులకు స మాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లిమృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత


ఫోన్ అప్పగిస్తున్న సీఐ చంద్రశేఖర్‌గౌడ్

రామగుండం: పట్టణంలోని ఎస్టీ కాలనీకి చెందిన బానోతు రాయమల్లు కొన్నిరోజుల క్రితం సెల్‌ఫోన్ పోవడంతో రామగుండం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఈ నేపథ్యంలో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ను గుర్తించి శుక్రవారం బాధితుడికి రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్ ఫోన్ తిరిగి అప్పగించడంతో బాధితుడు రాయమల్లు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామగుండం ఎస్సై బత్తుల శరణ్య ఉన్నారు.

'కాణిపాకం' ఆలయంలో మంత్రి పూజలు


పూజలు చేస్తున్న మంత్రి కుటుంబసభ్యులు

ధర్మారం(పెద్దపల్లి): చిత్తూరు జిల్లాలోని కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకపూజల అనంతరం అర్చకులు ఆశీర్వదించగా ఆలయ ఈవో మంత్రిని సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి


మాట్లాడుతున్న ముత్యంరావు

పెద్దపల్లిరూరల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా సదస్సులో మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలు, సౌకర్యాలు నిర్వీర్యం అవుతున్నాయని అన్నారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు నింగినంటాయని, వాటికనుగుణంగా కనీస వేతనాలు సవరించకపోవడం అన్యాయమని అన్నారు. నాయకులు కొమురయ్య, జ్యోతి, అంజయ్య, అరవింద్, వెంకటస్వామి, ఖాజ, మహేశ్, గట్టయ్య, చంద్రయ్య, తిరుపతి, నాగయ్య, దేవేందర్, రాజయ్య, లచ్చయ్య, రాజబాబు, గౌసొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

మెరుగైన వేజ్ బోర్డును సాధించాం

- జూన్ 4న 'చలో కొత్త గూడెం'
- వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ, ప్రధానకార్యదర్శి


మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: బొగ్గు గని కార్మికులకు మెరుగైన వేజ్ బోర్డు ఒప్పందం చేసుకున్నామని ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శుక్రవారం జీడికె–2 ఇంక్‌లైన్ ఏరియా వర్క్‌షాప్‌లో గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. 11వ వేజ్ బోర్డు ఒప్పందం కేంద్ర ప్రభుత్వం ఆలస్యం వల్లే జరిగిందన్నారు. ఆలస్యమైనప్పటికీ ఒప్పందం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. వేజ్ బోర్డులో బేసిక్‌పై 19 శాతం, అలవెన్సులపై 25శాతం పెంచామని, కార్మికుడు ప్రమాదంలో మరణిస్తే మ్యాచింగ్ గ్రాంట్‌తో సంబంధం లేకుండా యాజమాన్యం రూ.15లక్షలు ఇస్తుందని, 12 నుంచి 18 ఏళ్ల వయస్సుగల పిల్లలకు, ఆ కుటుంబానికి ఎంఎంసీ రూ.34వేలు చెల్లిస్తుందన్నారు. 18 ఏళ్ల తర్వాత డిపెండెంట్‌కు ఉద్యోగం కల్పిస్తారన్నారు. 10వ వేజ్‌బోర్డు నుంచి ఇవ్వాల్సిన గ్రాట్యుటీని 2017 నుంచి అధికారులకు అమలుచేశారని, కార్మికులకు అమలు చేయలేదని మాట్లాడితే యాజమాన్యం స్పందించలేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు, లేబర్ చట్టాలను అమలుచేయాలని ఒప్పందం చేసుకున్నామన్నారు. ప్రైవేటీకరణకు, కాంట్రాక్టీరణకు వ్యతిరేకంగా జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించే సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, రంగు శ్రీనివాస్, శంకర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు

- జనక్‌ప్రసాద్, ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నాయని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం జీడీకే–11గనిపై గేట్‌మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా 3 లక్షలకు పైగా బొగ్గుగని కార్మికుల వేతన సవరణలో కీలకపాత్ర పోషించామని, 19శాతం కనీస వేతనం పెరిగేలా కృషి చేశామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలను ప్రతిఘటించి కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేయించేందుకు కృషిచేశామన్నారు. వేతన ఒప్పంద ఏరియర్స్ మూడు నెలల్లో అందేలా చూస్తామన్నారు. 30 మంది యువ కార్మికులు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ధర్మపురి, వికాస్‌కుమార్‌యాదవ్, కృష్ణ, సాగర్, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై జీఎం సమీక్షా


యూనియన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్‌వోటూ జీఎం రఘుపతి

కమాన్‌పూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఆర్జీ–3 పరిధిలో ఘనంగా నిర్వహించేందుకు శుక్రవారం ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో కార్మికు సంఘాల నాయకులతో ఎస్‌వోటూ జీఎం రఘుపతి సమీక్షా సమావేశం నిర్వహించారు. వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారులు పద్మరాజు, డీవైపీఎంలు రవీందర్‌రెడ్డి, మారుతి, లక్ష్మినారాయణ, నాయకులు ఇసంపెల్లి రమేశ్, అల్లం తిరుపతి, బత్తుల రమేశ్ పాల్గొన్నారు.

జీడీకే–11గనిపై ఐఎన్‌టీయూసీ నిరాహార దీక్ష


నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

గోదావరిఖని: కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం ఐఎన్‌టీయూసీ నాయకులు నిరాహదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి జనక్‌ప్రసాద్ ప్రారంభించారు. నూతనంగా నిర్మిస్తున్న రోడ్డుతో కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. జీడీకే–2ఏ బ్రిడ్జి విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ధర్మపురి, సదానందం, వికాస్‌కుమార్‌యాదవ్, ఎట్టెం కృష్ణ పాల్గొన్నారు.